ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
బుధవారం 31 జనవరి 2024



పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి 8
శాస్త్రీయ కళల పరిరక్షణకు కృషి చేస్తాం 7

భూ కబ్జాదారులపై
కఠినంగా వ్యవహరించాలి

- సిరిసిల్ల నేతన్నకు ప్రభుత్వం వెన్నుదన్ను
- ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలి
- మహాశివరాత్రికి మెరుగైన వసతులు కల్పించాలి
- బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- సుదీర్ఘంగా జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

సిరిసిల్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలని, అన్యాక్రాంతమైన భూములను భూ బకాసురుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవాలని, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. శాఖల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014కు ముందు ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉండి తరువాత అన్యాక్రాంతమైతే ఆ భూమిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్వాధీనం చేసుకున్న స్థలాలను ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. ప్రజల స్థలాలను ఎవరైనా అక్రమించుకుంటే ఆధారాలతో కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయాలన్నారు. మీడియా దృష్టికి తేవాలన్నారు. ఏ పార్టీ వారైనా ఉపేక్షించవద్దని, భూములను విడిపించి నిజమైన యజమానులకు అప్పగించాలని ఆదేశించారు.

● సెస్ అక్రమాలపై ప్రభుత్వం సీరియస్

సిరిసిల్ల సెస్‌లో అక్రమాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని సెస్‌లో అలసత్వం, అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి అన్నారు. సెస్ అక్రమాలపై ప్రజలకు సమాచారం ఉంటే కలెక్టర్, ఎస్పీ దృష్టికి ఆధారాలతో తీసుకురావాలని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పవర్‌లూం కార్ఖానాలు, వినియోగదారులకు, ఇళ్లకు సంబంధించి కరెంట్ కట్ చేసి ఇబ్బందులకు గురిచేయవద్దని తెలిపారు. పవర్‌లూం కార్ఖానాలకు సంబంధించిన బకాయిలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుటుందన్నారు.

● నేతన్నలు చనిపోతే అధికారులపై మర్డర్ కేసులు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికారులు క్షేత్ర స్థాయిలో నేతన్నల్లో మనోధైర్యాన్ని నింపేందుకు కృషి చేయాలని మంత్రి అన్నారు. ఉపాధి లేక నేతన్నలు ఎవరు చనిపోయినా సంబంధిత అధికారులపై మర్డర్ కేసులు పెడతామని హెచ్చరించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గత ప్రభుత్వ హయాంలో రూ.225 కోట్లకుపైగా బకాయిలు ఉన్న విషయాన్ని జౌళి శాఖ అధికారులు వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సిరిసిల్ల నేతన్నలకు 365 రోజులు పని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. బతుకమ్మ చీరలతోపాటు ఆర్వీఎం, పాలి కాటన్ ఉత్పత్తికి ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తుందన్నారు. వర్కర్ టు ఓనర్ పథకం కోసం నిజమైన కార్మికులను గుర్తించాలని, కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని అన్నారు.

● పది ఫలితాల్లో జిల్లాను ముందు నిలపాలి

పదోతరగతి ఫలితాల్లో జిల్లాను ముందంజలో నిలవాలని విద్యా శాఖ అధికారులు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని మంత్రి అన్నారు. ప్రత్యేక తరగతులు, మోటివేషన్ క్లాస్‌లు, టెస్ట్‌లు నిర్వహించాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల్లో ఇప్పటికి మొదలు కానీ పనుల వివరాలను అందించాలని ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి సూచించారు. సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల పురోగతిపై చర్చించి క్రిటికల్ కేర్ సెంటర్, ఇతర అనుబంధ విభాగాలు, క్వార్టర్ల నిర్మాణాలకు భూ సేకరణపై సమీక్షించారు.

● మాది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం

మాది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని మంత్రి అన్నారు. ఉత్తమ సేవలు అందించే అధికారులకు ప్రశంసపత్రాలు అందిస్తామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాపాలనలో అధికారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని మంత్రి తెలిపారు.

● వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

జిల్లాలో వచ్చే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని మిషన్‌భగీరథ అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలో వర్షపాతం తక్కువగా నమోదు కావడం, నీటి నిల్వ తక్కువగా ఉండడం వల్ల వచ్చే వేసవిలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. వేములవాడల గుడి చెరువులో సరిపడా నీరు నిల్వ ఉండేలా చూడాలన్నారు. తాగునీటి, సాగునీరు సమస్యలు లేకుండా చూడాలని, వేములవాడకు మహాశివరాత్రికి వచ్చే భక్తులకు తాగునీటి మెరుగైన వసతులు కల్పించాలని అన్నారు. తెలంగాణ మొత్తానికి చేప పిల్లల విత్తన సరఫరాకు జిల్లా అన్ని విధాలుగా అనుకూలంగా ఉందన్నారు. మిడ్ మానేరు జలాశయంను కేంద్ర బిందువుగా చేసి తెలంగాణలో అన్ని జలాశాయాలకు చేపపిల్లలను సరఫరా చేసే కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మిడ్ మానేరు ముంపు గ్రామాల్లోని వెయ్యి మంది మత్స్యకారులకు కేజ్ కల్చర్ ద్వారా ఉపాధి కల్పిస్తామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ సూచన మేరకు ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముంపు గ్రామాల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

అగ్రహారం గుట్టల్లో ప్రభుత్వ భూముల లెక్క తేల్చాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ మండలం అగ్రహారం సమీపంలోని గుట్టల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూముల లెక్కలను తేల్చాలని, ప్రభుత్వ భూముల్లోని గుట్టల హద్దులు నిర్ణయించాలని ఆది శ్రీనివాస్ అన్నారు. హద్దులు నిర్ణయించకపోవడంతో మట్టి, గ్రానైట్ తరలిపోతోందని, ప్రభుత్వానికి నష్టం జరుగుతోందని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ భూముల వివరాలు గూగుల్ మ్యాపులో కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అగ్రహారంలో బీసీ హాస్టల్ ఏర్పాటుకు మంత్రిని కోరారు. రుద్రంగి మండల క్రేంద్రం నుంచి కొచ్చగుట్టా తండా రోడ్డు పూర్తి చేయాలని, ముంపు గ్రామాల ప్రజలకు స్వయం సహాయ చర్యల్లో కుటీర పరిశ్రమలతోపాటు ఫిషరీస్ విభాగంలో పరిశీలించాలని అన్నారు. నేతన్నలకు 365 రోజులు పనిల్పించే విధంగా త్వరలోనే పథకం ప్రారంభం అవుతుందన్నారు. సెస్‌లో జరిగిన అవినీతిపై విచారణ వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● బల్దియా నిధుల విడుదలకు వినతి

బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తొలిసారిగా సిరిసిల్లకు వచ్చిన సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ గత ప్రభుత్వం సిరిసిల్ల అభివృద్ధి కోసం రూ.40 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టే దశలో కొత్త ప్రభుత్వం అభివృద్ధి పనులను నిలిపివేసిందని వివరించారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా నిధులు విడుదల చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.

విద్యారంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 30: రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఖమ్మం పట్టణంలో ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యావైజ్ఞానిక మహాసభల పోస్టర్‌లను టీపీటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రామానాథ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఉమబాలచందర్, రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేద పాఠశాలను సందర్శించిన మంత్రి పొన్నం

గంభీరావుపేట, జనవరి 30 : గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని వేద పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి వేద పండితుడు రాధకృష్ణశర్మ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని సన్మానించి, ప్రసాదం అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, గడ్డం నర్సయ్య, సంగీతం శ్రీనివాస్, తిమ్మాపూర్ సింగిల్‌విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, స్థానిక నాయకులు ఉన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 30 : ఈవీఎం, వీవీప్యాట్ల ద్వారా ఓటు వేయడంపై ప్రజలకు అవగహన కల్పించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన ప్రదర్శక కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాలనుంచి కలెక్టరేట్‌తోపాటు వివిధ ప్రభుత్వ శాఖలకు వచ్చే ప్రజలకు ఓటు వేసే విధానంపై వివరించాలన్నారు. వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, రాజీకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ పాషా, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గించాలి

ఇల్లంతకుంట, జనవరి 30: క్రిమిసంహారక మందుల వినియోగాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ సూచించారు. ఇల్లంతకుంట, పొత్తూర్‌లోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్‌కు సంబంధించిన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అధిక మోతాదులో ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడడంతో భూమిలో సారం తగ్గిపోతుందన్నారు. చీడపీడల గురించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

ఉచిత రేబీస్ వ్యాక్సిన్ శిబిరం

వేములవాడ రూరల్, జనవరి 30: వేములవాడలోని పశువైద్య శాల ఆవరణలో అధికారులు ఉచిత రేబీస్ వ్యాక్సిన్ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కొమురయ్య, పశువైద్యాధికారి ప్రశాంత్ రెడ్డి, రజిత, రాజేందర్, కార్తిక్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలిచే పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 30: వరి పంటలను కాండం తొలిచే పురుగు పీడిస్తోందని, నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. దీపపు ఎర, లేదా సోలార్ దీపపు ఎర, లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగులపై నిఘా పెట్టాలని పేర్కొన్నారు. బుట్టకు 25-నుంచి 30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

సర్పంచుల సేవలు మరువలేనివి

వేములవాడ టౌన్, జనవరి 30: వేములవాడ అర్బన్ మండలంలోని సర్పంచులు చేసిన సేవలు మరువలేనివని జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రవ్వబాబు అన్నారు. సర్పంచ్‌ల పదవి కాలంలో నేటితో ముగియనుండడంతో మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచులను సన్మానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో సమస్యలు లేకుండా గ్రామాన్ని అభివృద్ధి బాటలో నిలిపిన సర్పంచ్‌లకు అభినందనలు తెలిపారు. ఎంపీడీవో శ్రీధర్, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ ఆర్సీరావు, సర్పంచులు ఇటిక్యాల నవీణ, జింక సునిత, ఊరడి రాంరెడ్డి, కొండపల్లి వెంకటరమణరావు, కదిరే రాజుకుమార్, రేగులపాటి రాణి, గుర్రం లక్ష్మారెడ్డి, రాసూరి రాజేశం, రంగు సత్తెమ్మ ఎంపిటీసీలు బుర్ర లహరిక, వనపర్తి దేవరాజు, బాస శేఖర్ సింగిల్ విండో చైర్మన్‌లు బీరెడ్డి సల్మాన్‌రెడ్డి, రేగులపాటి కృష్ణదేవరావు ఉన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు రెఫరీగా మదన్

సిరిసిల్ల టౌన్, జనవరి 30: జాతీయ కబడ్డీ పోటీలకు రెఫరీగా సిరిసిల్ల పట్టణం సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు బడావత్ మదన్ ఎంపికయ్యారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం పత్తిపాక వీధి సిద్ధార్థ హైస్కూల్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదన్‌ను సన్మానించారు. హైదరాబాద్ బాచుపల్లిలో ఫిబ్రవరి 1న ప్రారంభమవుతున్న కాసాని కౌసల్య ముదిరాజ్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మదన్ రెఫరీగా ఎంపికవడం హర్షనీయమన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవత ప్రభాకర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మాఘ అమావాస్య జాతర పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ రూరల్, జనవరి 30: మండలంలోని నాగాయపల్లి దుబ్బ రాజేశ్వరస్వామి ఆలయంలో 8, 9 తేదీల్లో జరిగే మాఘమావాస్య జాతర పోస్టర్‌ను విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. గురువారం సాయంత్రం గ్రామంలో పోచమ్మబోనాలు, శుక్రవారం శివ కల్యాణం, రథోత్సవం ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

● తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవాసంఘం జిల్లా క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లకావత్ మోతీలాల్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా బిక్కు నాయక్, కోశాధికారి ఇస్లావత్ దేవ్ సింగ్, గౌరవ అధ్యక్షుడు పర్శరాం, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ ఉద్యోగులు, సిబ్బందికి సన్మానం

చందుర్తి, జనవరి 30: మండలంలోని బండపల్లి గ్రామపంచాయతీ సిబ్బందిని మంగళవారం సర్పంచ్ న్యాత విజయ జార్జ్ ఆధ్వర్యంలో సన్మానించారు. సర్పంచుల పదవీకాలం ముగుస్తున్నందున ఉద్యోగులను, గ్రామ పంచాయతీ సిబ్బందిని, ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం సర్పంచ్ న్యాత విజయ జార్జిని గ్రామస్థులు సన్మానించారు. ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ఇల్లంతకుంట, జనవరి 30: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్‌లో మంగళవారం సీసీ కెమెరాలను ప్రారంభించారు. సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘటనలు జరిగినప్పుడు కేసులను ఛేదించడానికి సైతం సీసీ కెమెరాలు దోహదపడుతాయన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలిచేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డుభద్రతా నియమాలను పాటించాలని, అప్పుడే ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్‌లకు వాహనాలు ఇవ్వడం నేరం అన్నారు. ఇటీవల మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారికి జైలు శిక్షలు విధించినట్లు చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ఒలాద్రి సత్యనారాయణరెడ్డి, గొడిశెల మల్లేశంను అభినందించారు. కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్‌సీఐ సదన్‌కుమార్, సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్, ఎంపీటీసీ కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి, ఎస్సై దాస సుధాకర్, ఉపసర్పంచ్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన సర్పంచులు



సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

వీర్నపల్లి, జనవరి 30: వీర్నపల్లి మండల కేంద్రంలో ఎంపీపీ మాలోతు భూల అధ్యక్షతన మంగళవారం నిర్వహిం చిన మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలపై సర్పం చులు, ఎంపీటీసీలు గళమెత్తారు. ప్రభుత్వాలు మారుమూల వీర్నపల్లి ప్రాంతాన్ని చిన్న చూపు చూస్తున్నారని మండి పడ్డారు. ఎన్నికల సమయంలో మిగతా ప్రాంతాల్లో రోడ్లు అభివృద్ధి చేశారని, వీర్నపల్లి డబల్ రోడ్డు నిర్మాణాన్ని ఎన్నికల పేరిట అధికారులు జాప్యం చేశారని సర్పంచ్ దినకర్ పేర్కొ న్నారు. గ్రామాల్లో, తండాల్లో పేదలకు విద్యుత్ వినియోగం పేరిట అధిక కరెంటు బిల్లులు వేశారని శాంతినగర్ సర్పంచ్ మల్లేశం, ఎర్రగడ్డ తండా సర్పంచ్ జగ్మల్ నాయక్ అన్నారు. మారుమూల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని కాగితాలకే పరిమితం చేశారని ఎంపీటీసీ అరుణ్ కుమార్ మండిపడ్డారు. ఇప్పటి ప్రభుత్వంలోనైనా మండలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని పలువురు సర్పంచులు కోరారు. సర్పంచుల కాలం ముగుస్తుండడంతో గతంలో చేసిన అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీపీని కోరారు. అనంతరం 5 సంవత్సరాల కాలంలో గ్రామాల్లో చేసిన సేవలకు సర్పంచులను సన్మానించారు. జడ్పీటీసీ గుగులోతు కళావతి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఎడ్ల సాగర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్, ఎంపీడీవో నరేష్ కుమార్, తహసీల్దార్ ఉమారాణి, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి లక్షణాలను గుర్తించాలి



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ శ్రీరాములు

సిరిసిల్ల టౌన్, జనవరి 30 : కుష్ఠు వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ శ్రీరాములు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం జాతీయ కుష్ఠు నివారణ దినం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముందుగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఏటా కుష్ఠు నివారణ దినం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం నుంచి ఫిబ్రవరి 13 వరకు ప్రతీ గ్రామంలో కుష్ఠు నివారణపై సిబ్బందితో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా జనవరి 30 వరకు కొత్తగా 35 మంది కుష్ఠు బాధితులను గుర్తించినట్లు చెప్పారు. అందులో 23 మంది చికిత్స పొందారని, మిగతా వారు చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. కుష్ఠు లక్షణాలు ఉన్న వారి చర్మంపై తెల్లని, ఎర్రని, రాగి వర్ణం కలిగిన మచ్చలు ఏర్పడుతాయని, రాను రాను ఆ ప్రాంతలో స్పర్శ జ్ఞానాన్ని కోల్పోతుంటారని అన్నారు. పరిపెరల్ నరాలలో నొప్పి, వాపు కలిగి ఉండడం ప్రధాన లక్షణాలన్నారు. లక్షణాలు కలిగిన వారు వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించి మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత, డీపీఎంవో చేపూరి శ్రీనివాస్, రేవూర కాశీనాథం, కూన సురేష్, రెబెల్లి శ్రీనివాస్, సీహెచ్‌వోలు హెచ్‌ఈవోలు, హెచ్‌ఈ బాలయ్య పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- రేపటి నుంచి 15 వరకు ప్రయోగ పరీక్షలు
- మొత్తం 30 కేంద్రాలు
- హాజరయ్యే విద్యార్థులు 3196 మంది

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. గత సంవత్సరం కంటే ముందే టైంటేబుల్ విడుదల చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు. థియరీ పరీక్షల కంటే ముందు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మూడు దశల్లో ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 10 వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యాశాఖ పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసింది. జిల్లాలో ఇంటర్ విద్యార్థులు 8306 మంది ఉన్నారు. ప్రాక్టికల్స్‌కు 3196 మంది హాజరు కానున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో మోహన్

రెండు సెషన్‌లలో ప్రాక్టికల్స్

జిల్లాలోని ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ గురువారం నుంచి రెండు సెషన్‌లలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకోసం 30 కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. జనరల్ విద్యార్థులు 2252 మంది, ఒకేషనల్ విద్యార్థులు 944 మంది ఉన్నారు. ఇందులో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 3542 మంది, ఒకేషనల్ విద్యార్థులు 463 మంది, రెండో సంవత్సరం జనరల్ విద్యార్థులు 3820 మంది, ఒకేషనల్ విద్యార్థులు 481 మంది ఉన్నారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు సంబంధించి మంగళవారం ఇంటర్మీడియెట్ విద్యాధికారి మోహన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పొరపాట్లు జరగకుండా చూసేందుకు ఏర్పాట్లపై సమీక్షించారు.

ఇంటర్ విద్యార్థుల్లో ఈ సారి కొత్తగా ఇంగ్లీష్‌లోనూ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాన్ని పెపొందించడానికి 20 మార్కులు సంబంధించి ఫిబ్రవరి 16న ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. భాషా నైపుణ్యం పెరగడంతోపాటు స్కోరింగ్ కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

ఓటీపీ ద్వారా ప్రశ్నాపత్రం

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో పారదర్శకత ఉండే విధంగా ఇంటర్ బోర్డు ప్రశ్నా పత్రాన్ని కూడా ఓటీపీ సిస్టమ్ ద్వారానే కేటాయించనుంది. ప్రాక్టికల్స్ కేంద్రాలకు కేటాయించిన ఎగ్జామినర్‌ల ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ నమోదు చేసిన తరువాతనే ప్రశ్నాపత్రం డౌన్‌లోడ్ చేసుకోవాలి. పరీక్షలకు అరగంట ముందు ప్రశ్నా పత్రాలు ఆన్‌లైన్‌లో ఉంటాయి. కళాశాలల వారీగా ప్రశ్నాపత్రాలు వేర్వేరుగా రానున్నాయి. పరీక్షల సమయానికి అరగంట ముందు పరీక్ష పత్రాలను డౌన్‌లోడ్ చేస్తారు.

28 నుంచి వార్షిక పరీక్షలు

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ముగియడంతోనే ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 8306 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. థియరీ పరీక్షల్లో మొదటి సంవత్సరం జనరల్‌లో 3542 మంది, ఒకేషనల్‌లో 463 మంది, రెండో సంవత్సరం జనరల్‌లో 3820మంది ఒకేషనల్‌లో 481 మంది పరీక్షలకు హాజరు కాను న్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు.

ప్రాక్టికల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- చింతల మోహన్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి

ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్‌కు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. ఫ్రిబవరి 1 నుంచి 15వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయి. ఫిబ్రవరి 16న మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రయోగ పరీక్ష నిర్వహిస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.

కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై రౌడీషీట్

● భూకబ్జా కేసులో ఇద్దరికి బెయిల్ ● మరి కొందరిని విచారించిన పోలీసులు

కరీంనగర్ క్రైం, జనవరి 30 : భూకబ్జాలు, దౌర్జన్యాలకు సంబంధించిన ఫిర్యాదులపై అరెస్టు అయి ప్రస్తుతం జైలులో ఉన్న సీతారాంపూర్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై పోలీసులు మంగళవారం రౌడీషీట్ తెరిచారు. తన భూమిలో అక్రమంగా రోడ్డు వేసి, తనను బెదిరించి 10 లక్షల రూపాయలు తీసుకున్నాడని, సీతారాంపూర్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ తాటిపల్లి లింగారెడ్డి ఫిర్యాదుతో కరీంనగర్ 21వ డివిజన్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై ఈ నెల 24న కొత్తపల్లి పోలీసు ఠాణాలో కేసు నమోదు చేసి, అదే రోజు జంగిలి సాగర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలులోనే ఉన్న జంగిలి సాగర్ బెయిల్‌పై బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు తాజాగా కొత్తపల్లి ఠాణాలో రౌడీషీట్ తెరచారు. జంగిలి సాగర్ పలు క్రిమినల్ కేసుల్లో నిందితుడని, నేర ఘటనల్లో పాల్గొంటున్నాడని, అతనిపై 2011, 2022, 2023 లలో ఒక్కో కేసు, 2024లో రెండు కేసులు మొత్తం ఐదు కేసులు ఉన్నాయని, అతనిపై రౌడీషీట్ తెరవాలని ప్రతిపాదిస్తూ కొత్తపల్లి ఎస్‌ఐ కరీంనగర్ రూరల్ ఏసీపీకి పంపించగా ఈ మేరకు ఏసీపీ అనుమతి ఇచ్చారు. దీంతో కొత్తపల్లి ఎస్‌ఐ రౌడీషీట్‌ను తెరిచారు. జంగిలి సాగర్ కదలికలను నిత్యం గమనిస్తూ నిఘా ఉంచాలని ఏసీపీ ఆదేశించారు. భూకబ్జాలకు సంబంధించిన కేసులను దర్యాప్తు చేస్తున్న ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులు మాత్రం వారి విచారణలో భూకబ్జా జరిగిందని నిర్ధారణకు వచ్చిన సందర్భంలో మున్సిపల్, రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ఆ కేసులకు సంబంధించిన పక్కా డాక్యుమెంట్ ఆధారాలను సేకరించి కోర్టుకు సమర్పిస్తున్నట్లు తెలుస్తోంది. భూకబ్జాలకు సంబంధించిన కేసులు, ఫిర్యాదులపై ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులు దర్యాప్తు చేస్తున్నప్పటికీ దీనంతటిని పోలీస్‌కమిషనర్ మానిటరింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. నిందితులు తప్పించుకోకుండా, త్వరగా బెయిల్ రాకుండా కఠినంగా చర్యలు తీసుకుంటూ పలు సెక్షన్‌లను జోడిస్తూ కేసులను స్ట్రాంగ్ చేస్తున్నారు. మరో వైపున ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో బాధితుల సంఖ్య కూడా రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. బాధితులకు న్యాయం జరిగేలా, నిందితులు మళ్లీ ఇటువంటి నేరాలకు పాల్పడకుండా భయపడే విధంగా సీపీ చర్యలు చేపట్టి భూకబ్జాలపై ఉక్కుపాదం మోపడాన్ని ప్రజలు హర్షిస్తున్నారు.

● భూకబ్జాకు సంబంధించిన కేసులో ఈ నెల 17న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న కార్పొరేటర్ తోట రాములు, బీఆర్ఎస్ నాయకుడు చీటి రామారావులకు బెయిల్ లభించింది. మంగళవారం ఉదయం ఇద్దరు జైలు నుంచి విడుదలయ్యారు. ఈ నెల 17న ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు రెండుసార్లు పోలీసు కస్టడీకి తీసుకుని విచారించారు. కాగా భూకబ్జాలు, దౌర్జన్యాలపై వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం కూడా పలువురిని పోలీసులు విచారించి కొంత సమాచారాన్ని సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం


మహేష్ (ఫైల్)


వంశీకృష్ణారెడ్డి(ఫైల్)

ఓదెల, జనవరి 30: మండలంలోని గోపరపల్లి శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. గోపరపల్లికి చెందిన దాసరి వంశీకృష్ణారెడ్డి, కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన జీల మహేష్ , సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి చెందిన పసెట్ల సంజయ్ ముగ్గురు మిత్రులు. ఈ ముగ్గురు ఈ నెల 29న సోమవారం బైక్‌పై కొలనూర్ వైపు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత సుల్తానాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వంశీకృష్ణారెడ్డి(20) మృతిచెందగా, మహేష్(17) కరీంనగర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సంజయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు

ప్రమాదవశాత్తు బావిలో పడి గొర్రెల కాపరి మృతి

రుద్రంగి జనవరి 30: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన రుద్రంగి మండలం మానాల శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన భాగయ్య (24) అనే అనే కూలి మానాల గ్రామానికి గొర్లు మేపేందుకు వచ్చాడు. గొర్లు మేపుతున్న క్రమంలో తాగు నీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. సంఘటన స్థలానికి రుద్రంగి పోలీసులు చేరుకొని గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని వెలికి తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బాపిరెడ్డి తెలిపారు.

సర్పంచ్, ఉపసర్పంచ్ సస్పెన్షన్

పెగడపల్లి, జనవరి 30: మండలంలోని నామాపూర్ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతిలను నిధుల దుర్వినియోగం అభి యోగంలో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంపీవో మహేం దర్ తెలిపారు. గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరుబావులతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లకు గ్రామపం చాయతీ నుంచి నిధులు డ్రా చేసి, నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని అదే గ్రామానికి చెందిన ముదుగంటి పవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో కనకదుర్గ ఇటీవల గ్రామానికి వచ్చి రికార్డులు పరిశీలించి విచారణ చేసి నోటీసులు జారీ చేశారు. పనుల కు సంబంధించి సరైన ఆధారాలు చూపించక పోవడంతో డీఎల్‌పీవో సమర్పించిన నివేదిక మేరకు సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీవో తెలిపారు.

బాలికపై అత్యాచారం

ధర్మపురి, జనవరి 30: పట్టణంలో బాలికపై కొల్లూరి అర్జున్ (21) అనే యువకుడు అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన అర్జున్ ఇటీవల మైనర్ బాలికపై అత్యాచారం చేయగా ఆమె తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై జగిత్యాల డీఎస్పీ వెంకటస్వా మి విచారణ జరిపారు. అర్జున్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ పంపించినట్లు ఎస్ఐ దత్తాత్రి తెలిపారు.

కిటకిటలాడిన కొండగట్టు

● సమ్మక్క భక్తులతో పోటెత్తిన అంజన్న క్షేత్రం ● దైవదర్శనం చేసుకున్న 50వేల మంది


అంజన్న ఆలయం ఎదుట భక్తుల కోలాహలం


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

మల్యాల, జనవరి 30: కొండగట్టు అంజన్న క్షేత్రం మేడారం జాతరను తలిపించేలా మంగళవారం భక్త జనసంద్రంగా మారింది. మేడారంలో జరిగే సమ్మక్కసారక్క జాతర నేపథ్యంలో ముందుగా వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్నకు తొలి మొక్కులు తీర్చుకు నేందుకు గాను ఆలయాలను దర్శించడం ఆనవాయితీగా వస్తుండడం తో సమ్మక్క సారక్క భక్తులు కొండగట్టుకు తరలివస్తున్నారు. దాదాపు గా యాభై వేలకు వరకు భక్తులు అంజన్న ను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కి రిసాయి. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువ జామునుంచే స్వామి వారి దర్శనానికి బారులుతీరారు. కొండంతా భక్తులతో రద్దీగా మారింది. ఆలయానికి వచ్చే మార్గాలు, కోనేరు పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అనంతరం బేతాళుడు, శ్రీరాము ల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగిం ది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ, ఎస్సైలు అశోక్, కుమార స్వామి ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం నిండిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● ఆర్జిత సేవలతో ఇబ్బందులు..

వేలాదిగా తరలివస్తున్న భక్తుల రద్దీ నేపథ్యంలో మంగళవారం, శనివారం రోజుల్లో కొద్దిరోజుల పాటు వాహనపూజలు, అభిషేకాలను కొనసాగిస్తుండడం తో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహన పూజలకు వచ్చే వాహనాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలాగే ఆలయం లో అభిషేకాలతోనూ భక్తులకు అసౌకర్యం నెలకొం ది. ముందుగానే దేవ స్థానం అధికారులు సమాచా రం అందించి రద్దీ రోజుల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్ పరీక్షలు

తిమ్మాపూర్, జనవరి 30: తొలివిడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. మండలం కేంద్రం లోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, పరీక్ష కేంద్రాల్లో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12గంటల మొదటి సెషన్‌లో 827మందికి 815 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 12మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 634 మందికి 620మంది విద్యార్థులు హాజరు కాగా 14మంది పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి తెలిపారు.


హాల్‌టికెట్‌ను తనిఖీ చేస్తున్న సిబ్బంది

స్వచ్ఛతలో తహెర్‌కొండాపూర్ ఆదర్శం


పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న యునిసెఫ్ జిల్లా సమన్వయకర్త

కరీంనగర్ రూరల్, జనవరి 30: స్వచ్ఛతలో మండలంలోని తహెర్‌కొండాపూర్ గ్రామం ఆదర్శవంతంగా ఉందని ఐదు జిల్లాల శిక్ష ణ బృందం సభ్యులు అన్నారు. సోమ, మంగళవారాల్లో తహెర్‌కొండా పూర్, చర్లబూత్కూర్ గ్రామాల్లో యూనిసెఫ్ సభ్యులు, ఐదు జిల్లాల శిక్షణ బృందం సభ్యులు పర్యటించి ప్రజెంటేషన్ అందించారు. కొమురంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల నుంచి మండల పంచాయతీ అధికారులు, ఏబీఎం కన్సల్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో కూడిన 73 మంది సభ్యుల బృందం, యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్‌స్వామి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల రక్షణ, ఆరోగ్యం విషయాలపై రెండురోజుల శిక్షణ కార్యక్ర మంపై తహెర్‌కొండాపూర్, చర్లబూత్కూర్ గ్రామాలను సందర్శించా రు. తహెర్‌కొండాపూర్‌లో మరుగుదొడ్లు, చెత్త నిర్వహణ, మురికినీటి నిర్వహణ, షెడ్ల నిర్వహణ, అంగన్వాడి, మొక్కల పెంపకాన్ని పరిశీలిం చి, ప్రజెంటేషన్ అందించారు. చర్లబూత్కూర్‌లో పారిశుధ్య కార్మికులతో చర్చించారు. యునిసెఫ్ వాష్ కన్సల్టెంట్ ఫణీంద్రకు మార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ మమత, మారుతి పాల్గొన్నారు.

ఆటో నుంచి పడి కంప్యూటర్ ఆపరేటర్ మృతి

ధర్మపురి, జనవరి 30: ధర్మపురి మండలంలోని బూరుగుపల్లె వద్ద ఆటో నుండి కింద పడి మ్యాన సంతోష్ (30) అనే కంప్యూటర్ ఆపరేటర్ మంగళవారం మృతి చెందాడు. స్థానిక హనుమాన్‌వాడకు చెందిన సంతోష్ వెల్గటూర్ మండల ప్రజాపరిషత్ ఆఫీస్‌లో డేటా కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం విధులు నిర్వర్తించేందుకు సంతోష్ ఆటోలో బయలుదేరా డు. బూరుగుపల్లె వద్దకు చేరుకున్న ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి సడెన్‌గా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి అందులో ఉన్న సంతోష్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలిం చారు. సంతోష్ పరిస్థితి విషమించి మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుని భార్య మ్యాన సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దత్తాత్రి తెలిపారు.

బైపాస్ డిజైన్ మార్చాలి


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మెట్‌పల్లి, జనవరి, 30: బైపాస్ రోడ్డు నిర్మాణంలో విలువైన వ్యవసాయ భూములను కోల్పోయి వీధిపాలవుతున్నందున డిజైన్ మార్చేందుకు ప్రజాప్రతి నిధులు, అధికారులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని రైతులు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. మండలంలోని బండలింగాపూ ర్, వెల్లుల్ల, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు విలువైన వ్యవసాయ భూములు ఇచ్చేది లేదంటూ భూ సర్వేను నిలిపివేయాలని కొన్ని రోజుల కిందట రిలే దీక్షలను రైతులు చేపట్టారు. దీంతో రైతుల సమస్యలను తెలుసుకోవడానికి మంగళవారం ఆర్డీవో మధు కార్యాలయానికి పిలిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో విలువైన సాగు భూము లు కోల్పోయి తీవ్రంగా నష్టపోతామన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను తీసుకుంటే జీవనోపాధి కోల్పోయి ఎలా బతకాలని అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారుల అధికారులు రైతులను పిలిపించి పరిహారం ఎక్కువ ఇప్పించే ప్రయత్నం చేస్తామని సర్వేను కొనసాగించేందుకు సహకరిం చాలని కోరారు. దీంతో రైతులు ఈనెల 5తేదీ వరకు సర్వేను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్, జాతీయ రహదారి అధికారలు, ఆయా గ్రామాల బాధిత రైతులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి జైలు

కరీంనగర్ లీగల్, జనవరి 30: బాలికపై అత్యాచార యత్నానికి ఒడిగట్టిన కేసులో నిందితుడైన తాళ్ళపల్లి శంకరయ్య (45)కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ రెండో ప్రత్యేక పోక్సోకోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీవాణి మంగళవారం తీర్పునిచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరెల్లి రాములు కథనం మేరకు జగిత్యాల వెల్గటూర్ మండలం ఎండపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు బతుకుదెరువు కోసం చొప్పదండి గ్రామానికి వచ్చి కూలి పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారు. 2020 జూలై 15న ఉదయం భార్యాభర్తలు కూలి పనికి వెళ్లగా ఇద్దరు పిల్లలు ఇంటి వద్దనే ఉన్నారు. వీరిఇంటి పక్కన ఉండే తాళ్ళపల్లి శంకరయ్య మధ్యాహ్నం బాలిక (9)ని తన ఇంట్లోకి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో బాలిక తమ్ముడు అక్కడికి వచ్చి అది చూసి అరవడంతో ఆమెను వదిలి శంకరయ్య పారిపోయాడు. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి చొప్పదండి ఎస్ఐ వంశీకృష్ణ శంకరయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరిపారు. కేసు విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి శ్రీవాణి నిందితుడైన శంకరయ్యకు జైలుశిక్ష, జరిమానా విధించారు.

శాస్త్రీయ కళల పరిరక్షణకు కృషి చేస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - రాజన్న క్షేత్రంలో ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



ఆరాధనోత్సవాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పంచరత్న గానం వినిపిస్తున్న కళాకారులు

వేములవాడ, జనవరి 30: శాస్త్రీయ కళలను పరిరక్షించి ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లడానికి కృషిచేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేముల వాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ఉదయం త్యాగరాజస్వామి వారి 71వ ఆరాధన ఉత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రీయ కళల పరిర క్షణకు, మన సంస్కృతిని ప్రతిబింబించేదుకు ఇలాంటి ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మన సంస్కృతి, కళల పరిరక్షణకు ప్రభుత్వం తరపున తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వేములవా డ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వం లో త్వరలోనే వీటీడీఏ సమావేశం నిర్వహిస్తామని, పదేళ్లుగా ఆగిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు. అంతకుముందు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలోని అర్చకుల బృందం స్వస్తిపుణ్యావచనము చేసి త్యాగరాజ స్వామి చిత్రపటంతో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆరాధనోత్సవాల వేదికపై త్యాగయ్య చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించగా, రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన గావించి ఆరాధనోత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు కార్యక్రమాలలో భాగంగా తొలుత ఉదయం పాలెపు లక్ష్మణమూర్తి త్యాగరాజస్వామివారి జీవిత విశేషాలను వివరించగా, వి. జ్యోత్స్న లక్ష్మి, ఎం. సువర్ణ, నరహరిశర్మ, హెచ్. సతీష్, మంజుల, రేవతి, సునీత, కళ బృందము పంచరత్న గానం వినిపించారు. స్వర్ణలత, భాగవతారిణి హరికథా గానం చేయగా పద్మప్రియ సంగీత కచేరితో అల రించారు. గుమ్మడి జనార్దన్, వాణి సితార సోలో కచేరి, జె. ఉమాదేవి సంగీత కచేరితో ఆకట్టుకున్నారు. మంగళంపల్లి స్వర్ణలత శాస్త్రీయ సంగీత కచేరి, జి. రేఖ బృందం నృత్య ప్రదర్శన చేయగా, దుర్గా భవాని నాట్యమండలి వారు భక్త తులసీదాస్ చరిత్ర పౌరాణిక నాటకంతో ఆకట్టుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి డి కృష్ణప్రసాద్, ఉత్సవాల ఇన్‌చార్జి కే రామయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

చందుర్తి, జనవరి 30: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు సోమవారం రాత్రి మృతి చెందిన సంఘటన మండలంలోని జోగాపూర్ గ్రామం లో జరిగింది. గ్రామస్థుల పోలీసుల కథనం ప్రకారం సుతారి లచ్చిరెడ్డి (62) అనే వృద్ధుడు ఈ నెల 23న పొలం వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. గ్రామ శివారులోని శివాజీ విగ్రహం సమీపంలో మూడపల్లి చెందిన మరో వ్యక్తి ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ లచ్చిరెడ్డి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ద్విచక్ర వాహనదారులపై దాడి... కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 30: కరీంనగర్ రాజీవ్‌చౌక్‌లో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనదారులపై దాడికి పాల్పడిన ఎండీ షాబాద్, ఎండీ సాహిల్‌లపై కేసు నమోదు చేశామని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసు లు తెలిపారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శానగొండ విమలాచారి, వేములవాడ రమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాజీవ్‌చౌక్‌లో ఒక ఒక ఆటో ఢీకొట్టింది. ఆటో డ్రైవర్‌ను ఎందుకు ఢీకొట్టావని అడిగినందుకు ఇద్దరిపై ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు కర్రతో తలపై దాడిచేశారు. ఈ ఘటనపై అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య గొడవ జరగగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చెదరగొట్టారు. బాధితుల ఫిర్యాదుతో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాల కార్మికుడి గుర్తింపు

-యజమానిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 30: కరీంనగర్ వాసవిస్ట్రీట్‌లోని మాన్సి ఫాషన్ రెడీమేడ్ షాపులో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన బాల కార్మికుడు (14)ను గుర్తించిన పోలీసులు యజమాని కమలేష్‌ఉమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ స్మైల్ తనిఖీల్లో భాగంగా మంగళవారం తనిఖీ బృందం వెళ్లగా షాపులో బాలుడుని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాలుడిని చేరదీసి సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచామని తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

నలుగురు నిందితుల రిమాండ్

మెట్‌పల్లి, జనవరి 30: జల్సాలకు అలావాటు పడి డబ్బులు సరిపోక పోవడంతో సులువుగా డబ్బులు సంపాదించాలని వ్యవసాయ మోటార్లు, ట్రాక్టర్ ట్రాలీ దొంగతనాలకు పాల్పడిన నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవితో కలిసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని పాటిమీది తండాకు చెందిన గుగ్లావత్ నరేష్, జరుపుల ప్రకాష్, గుగ్లావత్ రవిలాల్, గుగ్లావత్ అనిల్ జల్సాలకు అలావాటు పడి మద్యానికి బానసయ్యారు. వీటికి డబ్బులు సరిపోకపోవడంతో మూడు నెలల నుంచి మండలంలోని జగ్గసాగర్, ఆత్మకూర్, వెల్లుల్ల గ్రామాలతో పాటు మల్లాపూర్ పరిసర ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్నా రు. 2023 నవంబరు 10న ఆత్మకూర్‌లోని వ్యవసాయ మోటార్లు దొంగతనం చేద్దామని వెళ్తుండగా గ్రామంలో ట్రాక్టర్ ట్రాలీని దొంగలిం చారు. గ్రామ శివారులోని పొలాల పొదల్లో దాచి పెట్టి, రెండు వ్యవసా య మోటార్లను దొంగలించి ట్రాలీ వద్ద దాచిపెట్టారు. 12 రోజుల తర్వా త మల్లాపూర్ మండలంలోని రాఘవపేటలోని నాలుగు వ్యవసా య మోటర్లు, ఈనెల 10న వెల్లుల్ల శివారులోని రెండు మోటర్లను అప హ రించారు. మళ్లీ ఈనెల 23న ఆత్మకూర్‌లోని మూడు వ్యవసాయ మో టార్లు దొంగలించారు. దొంగిలించిన మోటర్లను నిజామాబాద్‌లో అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని తెలుసుకొని ఈనెల 30న బయలు దేరారు. సీఐ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ఎక్స్ రోడ్డు వద్ద ఎస్సై చిరంజీవి తన సిబ్బందితో నిందితులను పట్టుకున్నారు. వారినుంచి ట్రాక్టర్ ట్రాలీ, 11 వ్యవసాయ మోటర్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న ఎస్సై, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐ

మహాత్మా గాంధీకి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్‌లు, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 30: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లతోపాటు జిల్లా అధికారులు మంగళవారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాంతంత్ర్యం వచ్చిందన్నారు. త్యాగధనులను స్మరించుకోవడం, దేశ పౌరులుగా మనందరి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో మామిండ్ల దశరథం, కలెక్టరేట్ విభాగాల పర్యవేక్షకులు శ్రీకాంత్, రమేష్, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్ : మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సిరిసిల్లలో మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గాంధీ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీల్లో తెలుగు విభాగంలో సృజన ప్రథమ, బవ్యశ్రీ ద్వితీయ, రేణుక తృతీయ, ఇంగ్లీష్ విభాగంలో హర్షిని ప్రథమ, కార్తీక ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారని మానేరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఆడేపు లక్ష్మణ్ తెలిపారు. విజేతలకు ఎస్పీ అఖిల్ మహాజన్ బహుమతులు అందజేశారు. ఉపాధ్యక్షుడు బూర దేవానందం, చిటికెన కిరణ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు ఎలగొండ రవి, సతీష్‌బాబు, నరేందర్, వెంకట్, రాములు, తిరుపతి, రాజలింగం పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. హనుమాన్ ఆలయ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్ ఆధ్వర్యంలో పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, గండి నారాయణ, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పల్లి గంగాధర్, తర్రె లింగం, మాడిశెట్టి అభిలాష్, గంధం మనోజ్, సిరికొండ రవి, స్వర్గం పరంధామ్, ఆట్లపల్లి మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద, ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొట్టే ప్రభాకర్, పులి సత్తయ్య, దారం రామచంద్రం, లింగంపల్లి అజయ్, ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మినారాయణ పాల్గొన్నారు

వీర్నపల్లి: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, సింగారం, తిమ్మాపూర్, గుండారం, రాజన్నపేట, అల్మాస్పూర్, బండలింగంపల్లి, వెంకటాపూర్, పదిర తదితర గ్రామాల్లో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. గ్రామాల్లోని మహాత్మా గాంధీ విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాపూజీ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

- మంత్రి పొన్నం ప్రభాకర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

వీర్నపల్లి, జనవరి 30: సర్పంచుల పదవీకాలం ముగిసినా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతామని, పార్టీలకు అతీతంగా అభివృద్ధిని నడిపిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, ధూమాల, రాగట్లపల్లిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో మంగళవారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. సర్పంచులు ప్రభుత్వాల ఒత్తిడితో పనులు చేయలేక నలిగిపోయారన్నారు. ప్రజాస్వామ్యంలో పార్టీలు మారుతాయని, ప్రజలు మారుతారు తప్ప అభివృద్ధి ఆగదన్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన గ్రామాల అభివృద్ధి నిరంతరంగా జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలు వినడానికి సిద్ధంగా ఉందన్నారు. సమస్యలన్నీ ఒకేరోజు పరిష్కారం కావని, అలా జరిగేది ఉంటే 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజల సమస్యలు ఎందుకు తీర్చలేదన్నారు. రవాణా శాఖ మంత్రిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. మహిళల ఉచిత ప్రయాణాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదని, ప్రతిపక్షాలు కావాలని విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం సరిపడా ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసిందని, ప్రతి గ్రామానికి బస్సు వచ్చేలా చూస్తామని అన్నారు. ఆటోవాలాలకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసే దిశగా ప్రణాళికలు కొనసాగుతున్నాయన్నారు. ఎల్లారెడ్డిపేట మండలాన్ని సొంత మండలంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ మండల కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

● ఎల్లారెడ్డిపేట మండల పర్యటనకు తొలిసారి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను యాదవ సంఘం నాయకులు, గౌడ సంఘం నాయకులు సన్మానించారు. అక్కడ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్ రావు, సర్పంచులు ముక్క శంకర్, కదిరే రజిత శ్రీనివాస్, దాసరి సుజాత మహేందర్, మేడిపల్లి దేవానందం, వైస్ ఎంపీపీ భాస్కర్, సెస్ డైరెక్టర్ కృష్ణ హరి, సింగల్ విండో డైరెక్టర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రామచంద్రం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులను ఎత్తివేస్తాం

ముస్తాబాద్: నిరంకుశ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీటీసీ గుండం నర్సయ్యతోపాటు ప్యాక్స్‌చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ కలకొండ కిషన్‌రావు, సర్పంచ్‌లు దేవేందర్, బద్ది కళ్యాణిభాను, రేసు లక్ష్మీమల్లేశం, అగ్రారం లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ మెర్గు యాదగిరిగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు చిట్నేని అంజనేయరావు, సురేందర్‌రావు, అన్నమనేని సుధాకర్‌రావు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, దాదాపు 500మందికిపైగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నియంత పాలనలో కాంగ్రెస్ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయిస్తామన్నారు.

నిర్బంధ పాలన నుంచి ప్రజాపాలన దిశగా..

దొరల నిర్బంధ పాలన నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను అందించే దిశగా అడుగులు వేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ముస్తాబాద్ నుంచి అత్యధిక మెజారిటీతో ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కనమేని చక్రధర్‌రెడ్డి, అన్నం మల్లికార్జున్ రెడ్డి, అన్నమనేని నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, వేముల సత్యనారాయణ, ఒరగంటి తిరుపతి, గడ్డం నర్సయ్య, బుర్ర రాములు, పెద్దిగారి శ్రీనివాస్, భాను, రంజాని నరేశ్, రాంరెడ్డి, కొండం రాజిరెడ్డి, ఉచ్చిడి బాల్‌రెడ్డి, శీల ప్రశాంత్, ఆగుల్ల రాజేశం, మామిండ్ల దేవరాజు, ధర్మేందర్, మహిపాల్‌యాదవ్, మట్ట రాణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ మండల కేంద్రంలోని సర్వాయి పాపన్న విగ్రహం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు తాటిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. స్థానిక సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తాటిపెల్లి శ్రీనివాస్, కొత్తపెల్లి బాలాగౌడ్, గుండెల్లి శ్రీనివాస్‌గౌడ్, వంగ స్వామిగౌడ్, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, అయోధ్యగౌడ్, బొంగోని శ్రీనివాస్, యాదగిరి, అక్కపెల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దింటి పెండ్లి పాట వచ్చింది

సిరిసిల్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన ప్రముఖ సినీ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ 'షరతులు వర్తిస్తాయి' అనే సినిమా కోసం రాసిన పెండ్లి పాటను మంగళవారం హైదరాబాద్‌లో ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల విడుదల చేశారు. ఈ పాటకు బొబ్బిలి సురేష్ సంగీతాన్ని సమకూర్చారు. అక్షర్‌కుమార్ దర్శకత్వం వహించిన సినిమాలో చైతన్య, భూమిక జంటగా నటించారు. తెలంగాణ పెళ్లి తంతుపై ఉన్న ఈ పాట ప్రతీ పెళ్లిలో మార్మోగుతుందని, కొత్త చరిత్ర సృష్టిస్తుందని శేఖర్ కమ్ముల అభిప్రాయపడ్డారు. పల్లె సంప్రాదాయాన్ని ప్రతిబింబించే విధంగా పాట కొనసాగుతుందన్నారు.

ట్రస్మా జిల్లా కమిటీ

సిరిసిల్ల రూరల్, జనవరి 30: జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమానుల సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ట్రస్మా రాష్ట్ర చీఫ్ న్యాయ సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ట్రస్మా జిల్లా కమిటీ సమావేశంలో నూతన కమిటీ ఎన్నికలను నిర్వహించడంతో గత కమిటీని రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాగుల శ్రీనివాస్‌గౌడ్, గౌరవ. అధ్యక్షుడిగా రేగులపాటి రవిచంద్ర, ప్రధాన కార్యదర్శిగా నరాల దేవేందర్, కోశాధికారిగా మండల చిరంజీవి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎండీ లతీఫ్, వాయిస్ ప్రెసిడెంట్‌లుగా ముత్యాల మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఈసీ మెంబర్‌లుగా లక్ష్మారెడ్డి, కొక్కుల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమానులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి భక్తుడికి తీవ్ర గాయాలు

వేములవాడ జనవరి 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం కోసం వేములవాడకు వచ్చిన భక్తుడు వసతి గదుల సముదాయం రెండో అంతస్తు పైనుంచి మంగళవారం ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడ్డాడు. వరంగల్ జిల్లా సంగెం మండలం వంజనపల్లికి చెందిన రాజేందర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శనం కోసం వేములవాడకు వచ్చాడు. నందీశ్వర వసతి గదుల సముదాయం పైఅంతస్తులోని గదిని అద్దెకు తీసుకున్నాడు. మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ప్రమాదవశాత్తు రాజేందర్ పైనుంచి కిందపడడంతో కాంపౌండ్ వాల్ పైనున్న ఇనుప ఊచలు గుచ్చుకున్నాయి. దీంతో తీవ్ర రక్తస్రావమైన రాజేందర్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 30 : ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అధ్యక్షతన ఆల్ ట్రేడ్ యూనియన్ జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ దేశంలోని జాతీయ కార్మిక సంఘాలు, రైతు సంఘాల నిర్ణయంలో భాగంగా ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు.

బీజేపీని ఓడించడానికి వామపక్షాల పోరాటం

ముస్తాబాద్, జనవరి 30 భవిష్యత్‌లో బీజేపీని ఓడించడానికి వామపక్షాలు పోరాటం చేస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ముస్తాబాద్‌లో మంగళవారం సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా గుంటి వేణు మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వంలో వామ పక్షాల మూలంగా ఏర్పడిన ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ అంబానీలకు దేశంలోని వనరులను అందిస్తున్నారన్నారు. గ్యారెంటీలను అమలు చేసి మంచి పాలన అందించాల్సిన అవసరం కాంగ్రెస్‌కు ఉందన్నారు. మండల కార్యదర్శి మిద్దె నర్సన్న, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

చైతన్యం నింపేందుకు 'రాజకీయ ఇస్తేమాలు'

సిరిసిల్ల టౌన్, జనవరి 30:ముస్లిం సమాజంలో రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు రాజకీయ ఇస్తేమాలు నిర్వహిస్తున్నట్లు జానో జాగో సంఘం జాతీయ అధ్యక్షుడు సయ్యద్ నిసార్ అహ్మద్ తెలిపారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో జానో జాగో సంఘం ఉత్తర తెలంగాణ జిల్లాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడే పార్టీకే ముస్లింలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కేంద్ర కమిటీ సభ్యుడు మేరాజ్ హుస్సేన్ మాట్లాడుతూ రాజ్యాధికారంలో బడుగు, బలహీన వర్గాలతోపాటు ముస్లింలు భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో జానో జాగో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంకే సారుద్దీన్, నాయకులు సయ్యద్ బాబా, అజీమ్, అబ్దుల్ రషీద్, బాబా, జిల్లా పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంభీరావుపేటలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు



ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

గంభీరావుపేట, జనవరి 30 : గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు కోళ్లమద్దిలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మంగళవారం ప్రారంభించారు. గంభీరావుపేటలో రూ.19.55 లక్షల అంచనాతో నిర్మించిన గ్రామ పంచాయతీ దుకాణాల సముదాయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. అంతకు ముందు కోళ్లమద్దిలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి గంభీరావుపేట మండలానికి వచ్చిన పొన్నం ప్రభాకర్‌కు ఘన స్వాగతం పలికారు. లింగన్నపేట, గంభీరావుపేట గౌడ సంఘం నాయకులు, పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించారు. లింగన్నపేటలో స్టుడియో-18 క్యాలెండర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. గంభీరావుపేటలో టీఆర్‌టీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొండూరు గాంధీ, సర్పంచులు కటకం శ్రీధర్‌పంతులు, ఏనుగు కేశవరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, ఎంపీపీ వంగ కరుణ, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఎంపీటీసీలు పర్శ స్నేహలత, పర్శరాములు, కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా ఉపాధిహామీ సామాజిక తనిఖీ

కోనరావుపేట, జనవరి 30 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నామ మాత్రంగా నిర్వహించారు. కోనరావుపేట మండల పరిషత్ ఆవరణలో మంగళవారం ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధి హామీ 14వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సామాజిక తనిఖీలో అధికారులు 28 గ్రామాల ఉపాధి హామీ పనుల లెక్కల వివరాలు తెలుపగా అందులో పసలేదని, జరిగిన పనుల లెక్కలు సరిగ్గా లేవని గ్రామాల్లో తనిఖీ వచ్చిన బృందాలు జిల్లా అధికారి మదన్ మోహన్‌కు, స్టేట్ ఉపాధి హామీ అధికారులకు వివరించారు. అనంతరం ఈ సామాజిక తనిఖీని ఉద్దేశించి జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనులు సక్రమంగా చేయాలని, మేట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు సరిగ్గా నమోదు చేయాలని అన్నారు. అడిషనల్ డీఆర్డీవో మదన్ మోహన్, ఏపీడీ నర్సింలు, స్టేట్ రిసోర్స్ పర్సన్స్ రామారావు, ఏపీవో శ్రీనివాస్, సర్పంచులు రేఖ సంతోష్, భారత నర్సయ్య, భారతి బాపురెడ్డి, రాములు నాయక్, ఎంపీటీసీ నరసింహచారి, టీఏలు, ఈసీ, జేతశ కార్యదర్శులు, అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, జడ్పీటీసీ మధ్య వాగ్వాదం

వీర్నపల్లి, జనవరి 30: ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో మంగళవారం అభివృద్ధి పనులకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావుకు మధ్య సభ వేదికపై వాగ్వాదం చోటు చేసుకుంది. ముందుగా జడ్పీటీసీ మాట్లాడుతూ వాహనంలో వస్తుండగా గత ప్రభుత్వం చాలా అభివృద్ధి చేసిందని మంత్రి ఓ వ్యక్తితో చెప్పారని జడ్పీటీసీ అనడంతో మంత్రి పొన్నం వెంటనే మైకు తీసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ.. భగవంతుడిపై విశ్వాసం ఉందని, తాను అలా అనలేదని అన్నారు. నువ్వు అలా చెప్తే నేనేం చేస్తా అని అన్నారు. మంత్రి ప్రసంగిస్తుండగా గత ప్రభుత్వంలో దరఖాస్తుల కోసం ప్రజలకు డబ్బులు ఖర్చయ్యాయని అనగా జడ్పీటీసీ జోక్యం చేసుకొని గత ప్రభుత్వంపై విమర్శలు చేయొద్దని అని అన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం దిగిపోగానే అసహనంగా మాట్లాడడం సరికాదన్నారు. ఇలా ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు జోక్యం చేసుకున్నారు. వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సంమయనం పాటించాలని సూచించారు.

ఘనంగా కూర మల్లమ్మ వర్ధంతి



కూర మల్లమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విమలక్క

వేములవాడ, జనవరి 30:జనశక్తి అగ్రనేతలు కూర రాజన్న, అమర్ తల్లి కూర మల్లమ్మ ఐదో వర్ధంతిని మంగళవారం వేములవాడలో ఘనంగా నిర్వహించారు. కూర మల్లమ్మ ఐదో వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని ఆమె స్వగృహంలో జిల్లా అమరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ కూర మల్లమ్మ కేవలం వ్యక్తి కాదని, వేలాది పోరాట తల్లుల అమరుల ప్రతిరూపమని చాటారు. నిత్యం రాజ్య నిర్బంధాన్ని ఎదుర్కొంటూ ఠాణాలు, కౌన్సిలింగ్‌ల చుట్టూ తిరుగుతూ ఏనాడూ తన పిల్లలు లొంగిపోవాలని ఒక్క మాట కూడా చెప్పని ధీరవనిత అని కొనియాడారు. తన చిన్న కొడుకు జైల్లో, పెద్ద కొడుకు అజ్ఞాతంలో ఉండగా మరణించిన తన భర్త కూర బాలయ్య చితికి నిప్పు పెట్టి సావిత్రిబాయిపూలేను మైమరిపించిందన్నారు. శ్రామిక శక్తి రాష్ట్ర నాయకురాలు రాజేశ్వరి, రేవతి, పురుషోత్తంరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్సూర్, పోతుల రమేష్, రాకేష్, వెన్నెల పాల్గొన్నారు.

రాజకీయ యుద్ధ సైనికులను సిద్ధం చేయాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 30 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అమ్ముడు పోని నాయకత్వ రాజకీయ యుద్ధ సైనికులను సిద్ధం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో బీఎస్పీ సిరిసిల్ల నియోజకవర్గం స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని సిరిసిల్ల నియోజకవర్గం అధ్యక్షుడు లింగంపల్లి మధూకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అంకని భాను మాట్లాడుతూ ఉన్నత వర్గాలకు చెందిన రాజకీయ వ్యాపారులు వారి మనుగడ కోసం బహుజన వర్గాలను ఓట్లు వేసే యంత్రాలుగా మారుస్తున్నారని మండిపడ్డారు. అనంతరం నాయకులు రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శులు దొడ్డె సమ్మయ్య, ఎనగందుల వెంకన్న, గజ్జెల అశోక్, రాష్ట్ర కార్యాలయం మేనేజర్ నేరెళ్ల హన్మంత్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జిలు బట్టు రాంచంద్రం, మ్యాకల మునీందర్, జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన గంభీరావుపేట సర్పంచ్

గంభీరావుపేట, జనవరి 30 : గంభీరావుపేట సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు కాంగ్రెస్‌లో చేరారు. పలు అభివృద్ధి పనుల ప్రారంబోత్సవాల్లో భాగంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ గంభీరావుపేట మండలంలో మంగళవారం పర్యటించారు. గంభీరావుపేటలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో సర్పంచ్ శ్రీధర్‌పంతులు కాంగ్రెస్‌లో చేరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొండూరు గాంధీ, సీనియర్ నాయకులు సత్యనారాయణగౌడ్, గడ్డం నర్సయ్య, సంగీతం శ్రీనివాస్, తిమ్మాపూర్ సింగిల్‌విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, సీనియర్ నాయకులు రవి, ఎంపీటీసీ పర్శరాములు, నాయకులు తదితరులు ఉన్నారు. గంభీరావుపేట సర్పంచ్ శ్రీధర్‌తోపాటు ముచ్చర్ల ఉప సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి, నాయకులు గాడిచర్ల శ్రీనివాస్, లక్ష్మయ్య, రంగన్న, రాజంతోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

గంభీరావుపేట, జనవరి 30 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ బీసీల కుల గణన చేపట్టాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. గంభీరావుపేట మండలం కోళ్లమద్దిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పర్శ హన్మండ్లు కలిశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. కులగణన అనంతరం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వినతి పత్రం అందజేశారు. మంత్రి పొన్నం స్పందిస్తూ బీసీలకు న్యాయం జరిగే విధంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని హామీ ఇచ్చారు. గంభీరావుపేటలో బీసీ హాస్టల్ మంజూరు చేయాలని మంత్రిని హన్మండ్లు కోరారు.

నిరాశ్రయులకు భరోసా అభినందనీయం

వేములవాడ టౌన్, జనవరి 30: దిక్కుతోచని స్థితిలో నిరాశ్రయులుగా మిగిలే వారికి భరోసా కల్పించడం అభినందనీయమని నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లికి చెందిన నగరపు ప్రశాంత్ రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్సకు కావాల్సిన డబ్బులు లేకపోవడంతో నాంపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువకులు ముందుకొచ్చి బాధిత కుటుంబానికి రూ.5 వేల నగదును సింగిల్ విండో చేతులమీదుగా అందజేశారు.

ప్రజలు తిరస్కరించినా వైఖరి మారలేదు

ఇల్లంతకుంట, జనవరి 30: ప్రజలు తిరస్కరించినా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వైఖరి మారలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గోసిగొంగడితో వచ్చిన రసమయి బాలకిషన్‌కు ఇన్ని ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేయించిన రసమయి బాలకిషన్‌కు ఎమ్మెల్యే సత్యనారాయణను విమర్శించే అర్హత లేదన్నారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల చేనేత పరిశ్రమను కాపాడుకుంటాం

- మంత్రి పొన్నం ప్రభాకర్



చేనేత విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి పొన్నం

సిరిసిల్ల టౌన్, జనవరి 30: సిరిసిల్ల చేనేత పరిశ్రమను గుండెల్లో పెట్టుకొని కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణానికి మంత్రిగా మొట్ట మొదటి సారిగా వచ్చిన సందర్భంగా పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. పట్టణంలోని నేతన్న, అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పూలమాలలు వేశారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక లహరి ఫంక్షన్‌లో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. కష్టకాలంలో పార్టీ వెంట ధైర్యంగా ఉండి రాష్ట్రంలో కాంగ్రెస్ గెలవడానికి కారకులైన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ వచ్చినా వారికి లొంగకుండా పార్టీ గెలుపుకు కృషి చేశారని, అదే స్ఫూర్తితో రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలలో పనిచేయాలని కోరారు. సిరిసిల్ల చేనేత పరిశ్రమను గుండెల్లో పెట్టుకొని కాపాడుకునే బాధ్యత ఈ ప్రభుత్వంపైన ఉందన్నారు. సిరిసిల్లలో రంగు రంగుల బంగలాలు, డివైడర్లు, ఫౌంటేన్‌లు, సెంట్రల్ లైటింగ్‌ల వెనక ఉన్న రహస్యాలు ప్రజలు తెలియవని, త్వరలో వాటిని బయటకు తీస్తామని అన్నారు. విశ్వాసంగా ఉండండి సిరిసిల్ల టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో సమీక్ష సమావేశం పెట్టుకున్నామని, న్యాయం చేసే బాధ్యత తమదేనని అన్నారు. గత ప్రభుత్వంలో మంత్రి కేటీఆర్ వచ్చిన ప్రతీసారి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులన్నింటిని ఎత్తివేసే విధంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామ్యం ఆ దిశలోనే ముందుకెళ్తున్నామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో దొరల పాలన పోవాలి ప్రజా పాలన రావాలని, రాహుల్‌గాంధీ ప్రజలను కోరారని అన్నారు. ప్రజలు గెలిపిస్తే ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్‌ను ప్రజా దర్బార్‌గా మార్చారన్నారు. అంతకుముందు సన్మాన కార్యాక్రమంలో కార్యకర్తలు మూకుమ్మడిగా వేదికపైకి రావడంతో మంత్రి స్వయంగా వారిని క్రమశిక్షణలో పెట్టే ప్రయత్నం చేయడం విశేషం. జడ్పీటీసీ నాగం కుమార్, కౌన్సిలర్లు లలిత, విజయనిర్మల, టీపీసీసీ సభ్యులు సత్య నారాయణ, సంగీతం శ్రీనివాస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాస్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు వనిత, పట్టణ అధ్యక్షురాలు స్వరూప, మాజీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు చక్రధర్‌రెడ్డి, నర్సయ్య, శివప్రసాద్ పాల్గొన్నారు.



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు

ప్రొటోకాల్‌పై సర్వసభ్య సమావేశంలో రగడ



సమావేశానికి హాజరైన ఎంపీపీ వజ్రవ్వ, జడ్పీటీసీ రవి

వేములవాడ టౌన్, జనవరి 30: వేములవాడ మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఎంపీపీ బూర వజ్రవ్వ అధ్యక్షతన చేపట్టిన సమావేశాన్ని ఎంపీడీవో శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదిక చదివి వినిపించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి నివేదిక చదువుతుండగా మండలంలో ప్రారంభోత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని, అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని వైస్ ఎంపీపీ ఆర్సీరావు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేములవాడ మండలం మారుపాకలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానా ప్రారంభోత్సవానికి జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రవ్వతోపాటు పలువురు ప్రజాప్రతినిధులను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అధికారికంగా ఆహ్వానించకపోవడంపై మండిపడ్డారు. ఆస్పత్రి ఇన్‌చార్జి లేదా డీఎంహెచ్‌వో సంబంధిత ప్రజాప్రతినిధులకు ఎందకు సమాచారం అందించలేదని నిలదీశారు. సంబంధిత డాక్టర్ మాట్లాడుతూ తనకు సమాచారం లేదని, ఉదయం 9 గంటలకు తనకు సమాచారం ఇచ్చారని చెప్పడంతో సరికాదన్నారు. ప్రొటోకాల్ పాటించకుంటే జాబ్ వదిలేసి ఇంట్లో కూర్చోవాలి తప్పా నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. దీంతో ఇక ముందు అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని సంబంధిత వైద్యుడు తెలపడంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం ఎంపీపీ వజ్రవ్వ, జడ్పీటీసీ మ్యాకల రవి మాట్లాడుతూ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి, రేగులపాటి కృష్ణదేవరావు ఉన్నారు.

శ్మశాన వాటికకు దారి చూపలేదని ఆగ్రహం

వేములవాడ మండలం కొడుముంజ శివారులోని గుట్టల ప్రాంతంలో శ్మశానవాటిక నిర్మాణం చేపట్టామని, వెళ్లేందుకు కనీసం దారి లేదని సర్పంచ్ కదిరే రాజ్‌కుమార్ ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై మండిపడ్డారు. ఐదేళ్లుగా ప్రతీ సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకొస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని ఒక్క సమస్యను పట్టించుకోలేదని, తమ పదవీకాలం అయిపోయినా గ్రామంలో శ్మశానవాటికకు దారిచూపకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.